సాక్షి
గుంటూరు
మంగళవారం । 9 । మే । 2023



శాస్త్రోక్తంగా సంకట హర చతుర్థి

ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో సోమవారం నుంచి నూతన ఆర్జిత సేవ సంకట హర చతుర్థి సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2000, గరిష్ట ధర రూ.4800, మోడల్ ధర రూ.3400 వరకు పలికింది.

తానా సభలకు ఆహ్వానం



గుంటూరుఎడ్యుకేషన్: తానా ఆధ్వర్యంలో జూలైలో అమెరికాలో జరగనున్న సభలకు హాజరు కావాల్సిందిగా జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాకు ఆహ్వానం అందింది.

న్యూస్‌రీల్

'సాక్షి' ఆధ్వర్యంలో రేపు ఉచిత చెస్ శిక్షణ

గుంటూరువెస్ట్: యువతలోని క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి స్థానిక బ్రాడీపేట 3/11 మాస్టర్‌మైండ్స్ బాలాజీ క్యాంపస్(వజ్రం హోటల్ వెనుక)లో ఉచిత ప్రత్యేక చెస్ శిక్షణ కార్యక్రమం జరగనుంది. మాస్టర్‌మైండ్స్ సౌజన్యంతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పేరొందిన శిక్షకులచే మెలకువలు నేర్పిస్తారు. ముందుగా వచ్చిన 30 మందికి మాత్రమే అవకాశం. ఉచితంగా శిక్షణతోపాటు పార్టిసిపేషన్ సర్టిఫికెట్, ప్రోత్సాహక బహుమతి కూడా ఇవ్వడం జరుగుతుంది. రిజిస్ట్రేషన్‌కు అంజిబాబును 92484 45648 నెంబర్‌లో సంప్రదించగలరు.

గుంటూరు దిశ డీఎస్పీగా రామారావు బాధ్యతలు స్వీకరణ



పట్నంబజారు: గుంటూరు దిశ పోలీసు స్టేషన్ డీఎస్పీగా కె.సి.హెచ్.రామారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1991 బ్యాచ్ ఎస్‌ఐ అయిన రామారావుకు గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పనిచేసిన అనుభవం ఉంది. 2011లో ఆయన సీఐగా పదోన్నతి పొంది, నెల్లూరు పరిసర ప్రాంతాల్లో పనిచేశారు. 2020లో డీఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన సీఐడీ కర్నూలు జిల్లాలో పనిచేశారు. అనంతరం బదిలీల్లో భాగంగా గుంటూరు దిశ పోలీసు స్టేషన్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ కలహాల నేపథ్యంలో స్టేషన్‌కు వచ్చే ప్రతి కుటుంబ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా మహిళలు, విద్యార్థినులు, యువతులతో అసభ్యకరంగా ప్రవర్తించి, వేధించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పారా మెడికల్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరుమెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పారా మెడికల్ ఉద్యోగాలను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. ఉద్యోగాలకు ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్హతలు, పోస్టుల వివరాలు, దరఖాస్తు ఫారాల కోసం గుంటూరుఏపీ.ఇన్/ఎంహెచ్2023 వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. ఆన్‌లైన్‌లో కాకుండా వ్యక్తిగతంగా ఇతర మాధ్యమాల ద్వారా దరఖాస్తులు స్వీకరించరని, ఈనెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

మొక్కజొన్నను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

మార్క్‌ఫెడ్ డీఎం కరుణ



మార్టూరు: రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మార్క్‌ఫెడ్ డీఎం కరుణ అన్నారు. మండలంలోని వలపర్ల గ్రామంలో సోమవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఆమె అధికారులు, రైతులతో మాట్లాడారు. తేమ శాతం 14 శాతం కంటే తక్కువ, ఇతర వ్యర్థాలు 1 శాతం లోపు ఉండాలన్నారు. రైతులు ఆర్బీకే సెంటర్లలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ లోకనాథం, ఏఓ వీ కిరణ్‌కుమార్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

యార్డుకు 1,00,102 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,00,102 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 96,526 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 64,054 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

మొక్కలకూ డాక్టర్!

- నాణ్యమైన, ఆరోగ్యకర పంటలపై ప్రభుత్వం దృష్టి
- మండలానికో ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటుకు రంగం సిద్ధం
- జిల్లాలో తొలి విడతగా 17 మంది ఎంపిక
- ఆర్‌బీకేల నుంచి సేవలు



కొరిటిపాడు(గుంటూరు): వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలకు నాంది పలికారు. విత్తు నుంచి పంట విక్రయం వరకూ అన్ని దశల్లోనూ అండగా నిలుస్తూ వ్యవసాయాన్ని పండుగ చేస్తున్నారు. పంట బాగుండాలంటే ఆరోగ్యకరమైన మొక్కల ఆవశ్యకత ఎంతైనా ఉందని గ్రహించిన ప్రభుత్వం.. మొక్కల సంరక్షణకు ప్రత్యేక వైద్యుడిని నియమిస్తోంది. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కింద మనుషులకు ప్రభుత్వ వైద్యులు ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే. ఇదే తరహాలో 'ప్లాంట్ డాక్టర్' అనే మరో విప్లవాత్మక విధానానికి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా శ్రీకారం చుట్టింది.

వీఏఏలే మొక్కల వైద్యులు...

మొక్కలను ఆరోగ్యకరంగా పెంచేందుకు, చీడపీడలు నివారించేందుకు గ్రామ వ్యవసాయ సహాయకుల(వీఏఏ)ను వైద్యులుగా నియమించనున్నారు. వీరు పొలాల్లోకి వెళ్లి మొక్కలకు ఆశించే చీడపీడలను ముందుగా గుర్తిస్తారు. రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను సూచిస్తారు. సలహాలు, సూచనలు అందిస్తూ ఆయా పంటల్లో తలెత్తిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తారు. సమస్య తీవ్రతను బట్టి అధికారులు నేరుగా శాస్త్రవేత్తలను సైతం ఆయా పొలాల్లోకి పంపించేందుకు చర్యలు తీసుకుంటారు.

మండలానికి ఒకరు చొప్పున...

మొక్కల వైద్యుల నియామకానికి వ్యవసాయ శాఖ ఇప్పటికే ప్రణాళికలు రూపొందించింది. తొలి దశలో మండలానికి ఒక రైతు భరోసా కేంద్రాన్ని ఎంపిక చేసిన ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్(పీహెచ్‌డీసీ) ఏర్పాటు చేస్తారు. ఆయా మండలాల్లోని ఆర్‌బీకేల్లో అనుభవం ఉన్న వీఏఏను ఎంపిక చేసి, పీహెచ్‌డీసీ డాక్టర్ హోదా కల్పిస్తారు. అగ్రికల్చర్ ఎమ్మెస్సీ, హార్టికల్చర్ ఎమ్మెస్సీ చదివిన వారికి ప్రాధాన్యం ఇస్తారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా 249 ఆర్‌బీకేలు ఉండగా.. ప్రస్తుతం మండలానికి ఒకటి చొప్పున 17 చోట్ల ప్లాంట్ డాక్టర్లను నియమించనున్నారు. వీరికి జిల్లా కేంద్రంలో శిక్షణ ఇస్తారు. వీరికి సాగు విధానాలపై వ్యవసాయ పరిశోధన కేంద్రం, కృషీ విజ్ఞాన కేంద్రం, ఉద్యాన వర్సిటీ శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు.

రైతులకు వరం...



చీడపీడల నుంచి పంటలను కాపాడేందుకు ప్రభుత్వం ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్(పీహెచ్‌డీసీ)లు ఏర్పాటు చేస్తోంది. ప్రతి మండలంలోని ఒక ఆర్‌బీకే కేంద్రం వద్ద పీహెచ్‌డీసీని ఏర్పాటు చేసి, దీనిలో బీఎస్సీ, ఎమ్మెస్సీ అగ్రికల్చరల్, హార్టికల్చర్ చేసిన వీఏఏను నియమించి పూర్తి బాధ్యతలు అప్పగిస్తారు. పంటలలో తెగుళ్లను ఎప్పటికప్పుడు గుర్తించి సకాలంలో రైతులు నివారణ చర్యలు తీసుకునేలా ఈ కేంద్రాలు సేవలు అందిస్తాయి. పీహెచ్‌డీసీలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయి. రైతుల పొలాల వద్దకు వీఏఏ వెళ్లి మరీ పంటల సాగు, చీడపీడలు, ఆరోగ్యకరమైన మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తారు. పురుగు మందులకు రైతులు వ్యయప్రయాసలు పడాల్సిన అవసరం తగ్గుతుంది. వీఏఏలకు త్వరలోనే శిక్షణ ఇస్తాం.

– నున్న వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి.

త్వరలోనే పేదలకు ఇళ్ల పట్టాలు

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూముల్లో లే అవుట్ల పరిశీలన



యర్రబాలెంలో ఇళ్ల స్థలాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

మంగళగిరి: సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు కేటాయించిన భూముల్లో అభివృద్ధి చేస్తున్న లే అవుట్లను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్న నేపథ్యంలో త్వరితగతిన లే అవుట్లలో ప్లాట్లు సిద్ధమయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఆర్‌డీఏ పరిధిలో సుమారు 20 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నామన్నారు. లే అవుట్ల పనులు కొనసాగుతున్నాయని, హద్దురాళ్ల పాతడంతో పాటు గ్రావెల్ రహదారులు, మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

నగర పరిధిలోని కృష్ణాయపాలెం, యర్రబాలెం, నవులూరు, నిడమర్రులో పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో అన్ని లేఅవుట్లలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరి కొద్దిరోజుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పేదలకు పట్టాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. డ్వామా పీడీ యుగంధర్ కుమార్‌తో పాటు పలువురు రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకుడిపై పోక్సో కేసు

పట్నంబజారు: మైనర్ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన ఓ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడిపై పోక్సో కేసు నమోదైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దిశ పోలీసుస్టేషన్ సీఐ బి.నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు పండరీపురంలో పులుగు దీపక్ యువ ఇనిస్టిట్యూట్ పేరుతో కోచింగ్ సెంటర్ ప్రారంభించారు. కృష్ణా జిల్లా విస్సన్నపేట ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న దీపక్ గుంటూరులోని పండరీపురం, విజయవాడలలో ఇనిస్టిట్యూట్స్ నిర్వహిస్తున్నాడు. గుంటూరు రూరల్ ప్రాంతానికి ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థిని ఎంసెట్ కోచింగ్ నిమిత్తం గుంటూరు పండరీపురంలోని ఇనిస్టిట్యూట్‌లో చేరింది. విద్యార్థిని చేరినప్పటి నుంచి దీపక్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు, లైంగిక వేధింపులు ప్రారంభించాడు. ఈనేపథ్యంలో ఏప్రిల్ 16న విజయవాడలోని తన ఇనిస్టిట్యూట్‌కు క్లాసులకు హాజరు కావాలని చెప్పడంతో విద్యార్థిని తన తండ్రిని తీసుకెళ్లింది. సాయంత్రం వరకు క్లాసులు జరుగుతాయని విద్యార్థిని తండ్రిని పంపించాడు. ఇతర విద్యార్థులను కూడా వెళ్లాలని చెప్పాడు. ఒంటరిగా విద్యార్థినిని తన రూములోకి తీసుకెళ్లి లైంగిక దాడికి ఒడిగట్టాడు. అసభ్యకరంగా ప్రవర్తించి, ఇష్టానుసారంగా మైనర్ విద్యార్థిని శారీరక వేధింపులకు గురిచేశాడు. ఈవిషయం ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. ఈక్రమంలో ఇంటికి వచ్చిన విద్యార్థిని ప్రవర్తన గమనించిన తల్లిదండ్రులు ఆరా తీయగా, దీపక్ తనపై వ్యవహరించిన తీరును చెప్పి బోరున విలపించింది. బాధితురాలు, ఆమె తల్లిదండులు దిశ పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోక్సో, లైంగికదాడి, లైంగికదాడి యత్నం, వేధింపుల సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపారు. నిందితుడిపై తూర్పు గోదావరి జిల్లాలోని సీతానగర్‌లో కళాశాలలో పనిచేస్తున్న సమయంలో సైతం అనేక అంశాలపై ఏడు కేసులు నమోదు అయినట్లు పోలీసులు తెలిపారు.

ఏసీబీ వలలో కొండూరు వీఆర్‌ఓ

రైతునుంచి రూ.15వేలు లంచం తీసుకుంటూ చిక్కిన వైనం

అచ్చంపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓ రైతునుంచి కొండూరు వీఆర్‌ఓ కొచ్చర నాగేశ్వరరావు రూ.15వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కొండూరు వీఆర్‌ఓ కొచ్చర నాగేశ్వరరావు వేల్పూరు, గ్రంథశిరి గ్రామాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుంటారు. గ్రంథశిరి గ్రామానికి చెందిన కిలారి మురళి అనే రైతు తన తండ్రి చెంచయ్య పేరున సర్వే నెం.140లో ఉన్న 5.75 ఎకరాలను ఆన్‌లైన్‌చేసి అడంగల్, 1-బిలలో నమోదు చేయాలని వీఆర్‌ఓ నాగేశ్వరరావుని ఆశ్రయించాడు. దీంతో 4.25 ఎకరాలు మాత్రమే నమోదు చేయడానికి సాధ్యపడుతుందని వీఆర్‌ఓ చెప్పి, మిగతా భూమికూడా నమోదు చేయాలంటే రూ.50,000 లంచం ఇవ్వాలని అడిగాడు, చివరకు రూ.20 వేలకు రైతు ఒప్పుకున్నాడు. ఈనెల 5న రైతు మురళి రూ.5వేలు ఇచ్చాడు. మిగిలిన రూ.15వేలు సోమవారం ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈవిషయమై మురళి ఆదివారం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు సోమవారం మధ్యాహ్నం 12.30 సమయంలో వీఆర్‌ఓకు రూ.15వేలు నగదు ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ ప్రతాప్ తన సిబ్బందితో వచ్చి రెడ్‌హ్యాండెడ్‌గా వీఆర్‌ఓ నాగేశ్వరరావును పట్టుకున్నారు.

చీరాల టీడీపీలో మరో చిచ్చు

- సీటు మాదంటే మాదేనంటూ ప్రచారం
- మీడియా సమావేశం పెట్టి ఒకరిపై మరొకరు విమర్శలు
- తలలు పట్టుకుంటున్న తమ్ముళ్లు





ఎంఎం కొండయ్య



కాండ్రు శ్రీనివాసరావు

చీరాల: నియోజకవర్గంలో టీడీపీ చీలికలు పేలికలుగా మారింది. ఇప్పటికే వర్గపోరు, పోటాపోటీ కార్యక్రమాలతో సతమతమవుతున్నారు. మరో వైపు క్యాడర్ లేక అవస్థలు పడుతున్నారు. సీట్ల రగడతో టీడీపీ నేతలు మరీ దిగజారి ఒకరిపై ఒకరు మీడియా సమావేశాలు పెట్టి ఆరోపణలు సంధించుకోవడం విశేషం. ప్రస్తుతం ఎంఎం కొండయ్య టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. మంగళగిరికి చెందిన కాండ్రు శ్రీనివాసరావు గత కొద్ది నెలలుగా చీరాలలో మకాం వేసి చీరాల సీటు చేనేతలదేనని అందులో భాగంగా తమకే ఇచ్చేందుకు లోకేష్ అంగీకరించారని ప్రచారం చేస్తున్నారు. మంగళగిరి మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన కాండ్రు శ్రీనివాసరావు చేనేత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. ఆయన, అనుచరులు ఆదివారం రామాపురంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చీరాలలో చేనేతలు అధికంగా ఉన్నారని, అక్కడ వారి సమస్యలు పరిష్కరించి పార్టీని బలోపేతం చేయాలని తమకు లోకేష్ సూచించారన్నారు. మరో అడుగు ముందుకేసి మంగళగిరిలో తాము లోకేష్‌కు సహకరిస్తే చీరాలలో సీటు కోసం తాను సహకరిస్తానని లోకేష్ అన్నట్లుగా కాండ్రు శ్రీనివాసరావు అనుచరులు మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆయన చేనేత ప్రాంతాల్లో ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఒక విధంగా చెప్పాలంటే సీటు తమకే వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు.

వ్యతిరేక వర్గం కౌంటర్..

అయితే దీనిని వ్యతిరేకిస్తూ సోమవారం కొత్తపేటలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య అనుచరులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అసలు కాండ్రు శ్రీనివాసరావు ఎవరని.. చీరాలలో రాజకీయం చేయడం ఏంటని ప్రశ్నించారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడు ఆయన ప్రత్యేకంగా ప్రెస్‌మీట్‌లు పెట్టడం ఏంటని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఇన్‌చార్జికి తెలియకుండా ప్రెస్‌మీట్‌లు పెడితే ఎలాగంటూ ఒకింత గట్టిగా హెచ్చరించారు. ఈ వ్యవహారంపై పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతానని అన్నారు. ఇన్‌చార్జి ఆధ్వర్యంలోనే ఎవరైనా వచ్చి పనిచేయాలని, లేకుంటే పద్ధతిగా ఉండదన్నారు. కులాలను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయవద్దని హెచ్చరించారు. ప్రెస్‌మీట్ జరుగుతున్న సమయంలో పక్క గదిలో ఎంఎం కొండయ్య ఉండి అనుచరులతో సమావేశం నిర్వహింపచేయడం విశేషం. ఈ పరిణామాలతో తెలుగుదేశం పార్టీలో మళ్లీ అగ్గి రాజుకున్నట్లయింది. ఇప్పటికే నియోజకవర్గంలో కొండయ్య ఒక వర్గానికి నాయకత్వం వహిస్తుండగా నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి యడం బాలాజీ పార్టీ కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. దీనికి తోడు పట్టణ మాజీ అధ్యక్షుడు దేటా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాలు పోటీగా జరుగుతున్నాయి. పార్టీ పిలుపు ఇచ్చిన కార్యక్రమాలను ఇప్పటికే ముగ్గురు నిర్వహిస్తుండగా ఎన్నికల సమయం ఆసన్నమవడంతో సీట్ల విషయంలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. అయితే టీడీపీ క్యాడర్ మాత్రం టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి వైఎస్సార్ సీపీలోకి వచ్చిన కరణం బలరామ కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ వైపు అధికంగా ఉండడం విశేషం.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

- జాయింట్ కలెక్టర్ రాజకుమారి
- స్పందనలో 138 అర్జీల స్వీకరణ



స్పందన కార్యక్రమంలో బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ రాజకుమారి

గుంటూరు వెస్ట్: అర్జీలు పరిష్కరించే క్రమంలో కొందరు ఉద్యోగులు రోజులతరబడి తమ వద్దే ఉంచుకుంటున్నారని దీంతో బాధితులు మళ్లీ మళ్లీ స్పందనకు వస్తున్నారని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో జేసీ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలైతే 48 గంటల్లోనే పరిష్కరించాలన్నారు. అర్జీ పరిష్కారం ఆలస్యమైతే బాధితులకు కారణాలు తెలపాలన్నారు. కొందరు అర్జీదారులు వ్యక్తిగత కారణాలతో తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని చెప్పారు. ఇది సరికాదని హితవు పలికారు. దీనివల్ల ఉద్యోగుల విలువైన సమయం వృథా అవుతుందన్నారు. తప్పుడు ఫిర్యాదులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వచ్చిన 138 అర్జీలను జేసీతోపాటు డీఆర్‌ఓ చంద్రశేఖరరావు, జిల్లా అధికారులు పరిశీలించారు.

భర్త మరణించి నాలుగేళ్లయినా పెన్షన్ రావడంలేదు...



నా భర్త మలేరియా డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ నాలుగేళ్ల క్రితం మరణించారు. అప్పటి నుంచి న్యాయబద్ధంగా రావాల్సిన పెన్షన్ గురించి అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాను. ఏవేవో పేపర్లంటూ తిప్పుతున్నారు. కుటుంబ పోషణ కష్టంగా ఉంది. న్యాయం చేయండి. – ఆర్.మల్లేశ్వరి, గుంటూరు

చాలీచాలని జీతాలతో ఇబ్బందులు...

గత 17 సంవత్సరాలుగా జిల్లాలో సుమారు 270 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు జీతాలు పెంచలేదు. అతి తక్కువ జీతంతో పనిచేస్తున్న మాకు జీవితం భారంగా మారింది. కుటుంబ అవసరాలు పెరిగాయి. జీతాలు పెంచడంతోపాటు ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని మనవి.



– సీడాప్ ఉద్యోగ సంఘ నాయకులు

లూపస్.. వెరీ డేంజరస్

గుంటూరు నగరానికి చెందిన 25 ఏళ్ల రజినికి వివాహమై మూడేళ్లయినా సంతానం కలగలేదు. ఆరు నెలలుగా కీళ్ల నొప్పులు ఉన్నా పట్టించుకోకుండా తన రోజువారీ పనులు చేసుకుంటుంది. కీళ్ల నొప్పులకు తోడు ఆయాసం వస్తుండడంతో ఓ రోజు భర్తకు తన ఆరోగ్య పరిస్థితి తెలియజేయటంతో వారం రోజుల క్రితం ఆస్పత్రికి వెళ్లారు.. డాక్టర్లు పరీక్షలు చేసి రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని దీనికి కారణం లూపస్ వ్యాధి అని చెప్పడంతో వారు హతాశులయ్యారు.

- వ్యాధి గుర్తించేలోగా మృత్యువాత
- ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నియంత్రించే అవకాశం
- వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలంటున్న వైద్యులు
- ఈనెల 10న వరల్డ్ లూపస్ డే


గుంటూరు మెడికల్: ప్రపంచ వ్యాప్తంగా సుమారు 50లక్షల మంది లూపస్ వ్యాధితో బాధపడుతున్నారు. లూపస్ వ్యాధిపై ప్రజలతోపాటుగా వైద్యులకు కూడా సరైన అవగాహన లేకపోవటం వల్లే ముందస్తుగా వ్యాధిని గుర్తించలేకపోతున్నట్లు వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. ప్రతిరోజూ కిడ్నీలు ఫెయిల్ అయ్యి తమ వద్దకు వస్తున్న వారిలో లూపస్ వ్యాధి బాధితులు అధికంగా ఉన్నారని గుంటూరుకు చెందిన సీనియర్ కిడ్నీ వ్యాధి నిపుణులు డాక్టర్ చింతా రామకృష్ణ వెల్లడించారు. ఈనెల 10న ప్రపంచ లూపస్ డే సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

లూపస్ వ్యాధి ఎందుకొస్తుంది?

లూపస్ అంటే లాటిన్‌లో తోడేలు అని అర్థం. ఇది ఆటోఇమ్యూనో వ్యాధి. ఈ వ్యాధి ఎందుకు వస్తుందో, ఎలా ప్రవర్తిస్తుందో కారణాలు పూర్తిగా తెలియదు. సాధారణంగా శరీరంలో ఉన్న ఇమ్యూనిటీ సిస్టమ్ బయటి నుంచి వచ్చే ఇన్‌ఫెక్షన్‌లు, ఫారిన్ బాడీస్‌ను ఎదుర్కొని మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి తోడ్పడుతుంది. ఇమ్యూనిటీ సిస్టమ్‌లో లోపాల వల్ల శరీరంలో వివిధ అవయవాల్లో ఉండే సాధారణ కణాలు ఫారిన్‌బాడీస్ వల్లే గుర్తింపబడి సాధారణ కణాలు విచ్ఛిన్నమై అవయవాలు దెబ్బతినడం వల్ల లూపస్ వ్యాధి వస్తుంది.

జిల్లాలో బాధితులు...

లూపస్ వ్యాధి ముఖ్యంగా మహిళల్లో వస్తుంది. ప్రతి పది మంది వ్యాధిగ్రస్తుల్లో 8 మంది మహిళలే. 18 నుంచి 45 వయస్సులో ఉన్న వారికి ఈవ్యాధి వస్తుంది. మగవారిలో, చిన్నపిల్లల్లో, వృద్ధాప్యంలో ఉన్నవారికి వ్యాధి వస్తే తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా లక్ష జనాభాలో వంద మంది లూపస్ వ్యాధి బాధితులు ఉన్నారు. గుంటూరులో నలుగురు రుమటాలజీ వైద్య నిపుణులు ఉన్నారు. ప్రతినెలా ఒక్కో డాక్టర్ వద్దకు పది మంది వ్యాధి బాధితులు చికిత్స కోసం వస్తున్నట్లు తెలిపారు.



వరల్డ్ లూపస్ డే పోస్టర్

వ్యాధి లక్షణాలు..

లూపస్ వ్యాధి ఏ క్షణంలోనైనా, ఏవిధంగానైనా, ఏ అవయవాన్నైనా దెబ్బతీస్తుంది. తల నుంచి కాళ్ల వరకు, కిడ్నీల నుంచి గుండె వరకు అన్ని అవయవాలపై ఈ వ్యాధి దాడికి దిగి అవయవాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. దీర్ఘకాలంగా జ్వరం ఉండటం, బరువు తగ్గడం, విపరీతమైన నీరసం, కీళ్ల నొప్పులు, జుట్టు రాలడం, నోటిపూత, రక్తకణాలు తగ్గడం, మూత్రపిండాలు పాడవడం, మూర్ఛ వ్యాధి, అబార్షన్లు, పిల్లలు లేకపోవటం, బహిష్టు సమయంలో అధిక రక్తస్రావం, ముఖంపై, శరీరంపై సీతాకోకచిలుక ఆకారంలో దద్దుర్లు కనిపించడం వ్యాధి లక్షణాలు.

తొలిదశలో గుర్తించవచ్చు..

పైన పేర్కొన్న లక్షణాలు ముఖ్యంగా యుక్తవయస్సులో ఉన్న మహిళల్లో కనిపిస్తే తక్షణమే రుమటాలజిస్టును సంప్రదిస్తే ఏఎన్ఏ, డీఎస్‌డీఎన్ఏ రక్తపరీక్షల ద్వారా వ్యాధిని తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించవచ్చు. లూపస్ వ్యాధి నిర్ధారణ చేసే సమయానికే కనీసం మూడేళ్ల ముందుగానే శరీరంలో మార్పులు జరుగుతాయి. కొన్ని సార్లు వైద్యులు వ్యాధిని గుర్తించేలోగా కిడ్నీ ఫెయిల్యూర్, మూర్ఛ వ్యాధి, గుండెజబ్బుల వల్ల మరణం సంభవిస్తుంది. హార్మోన్ల అసమతుల్యత వల్ల, జన్యుపరమైన లోపాల వల్ల వివిధ పర్యావరణ కారకాల వల్ల వ్యాధి సంభవిస్తుంది.

కిడ్నీలను దెబ్బతీస్తుంది..



లూపస్‌వ్యాధి కిడ్నీలో నెఫ్రాన్స్‌ని దెబ్బతీస్తూ రక్తాన్ని శుద్ధి చేయకుండా చేయటం వల్ల కిడ్నీలు ఫెయిల్ అవుతాయి. మొదటి దశలో వ్యాధిని గుర్తిస్తే కిడ్నీలు పూర్తిగా పాడవకుండా కాపాడి పనిచేసేలా చేయవచ్చు. వైద్య చికిత్సలతో వ్యాధి బాధితులకు 80శాతం ఉపశమనం లభిస్తుంది. లూపస్ నెఫ్రిటీస్ వ్యాధి మొదటి దశలో గుర్తించి చికిత్స చేయవచ్చు.

– డాక్టర్ చింతా రామకృష్ణ, సీనియర్ నెఫ్రాలజిస్ట్, గుంటూరు

అవగాహనతో నియంత్రణ ..



అనుభవజ్ఞులైన వైద్యుల సమక్షంలో తగిన మోతాదులో సరైన సమయంలో మందులు వాడితే వ్యాధిని నియంత్రణలో పెట్టవచ్చు. లూపస్ వ్యాధికి సరైన చికిత్స తీసుకోని పక్షంలో మరణాలు సంభవించే అవకాశం ఉంది. తొలిదశలోనే గుర్తించి నియంత్రణలో పెట్టడం ద్వారా మరణాలు సంభవించకుండా చూడవచ్చు.

– డాక్టర్ మానుకొండ మురళీకృష్ణ, రుమటాలజిస్టు, గుంటూరు

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి: డొక్కా

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ బలోపేతానికి అనుబంధ విభాగాలు పని చేయాలని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ కోరారు. కృష్ణనగర్‌లోని ఆయన కార్యాలయంలో సోమవారం అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అనుబంధ విభాగాల కార్యవర్గాలను ఏర్పాటు చేసే దిశగా ముందుకు సాగాలన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలోకి తీసుకెళ్లాలని కోరారు. మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనుబంధ విభాగాల అధ్యక్షులు డాక్టర్ వై.షేక్, ఆవుల సుందరరెడ్డి, కృష్ణమోహన్, భగవాన్, మాదా రాధా పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై చీటింగ్ కేసు

మంగళగిరి: కానిస్టేబుల్‌పై చీటింగ్ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. నగర పరిధిలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గత కొంత కాలం క్రితం కానిస్టేబుల్ గోవింద్ విధులు నిర్వహించాడు. పట్టాభిపురం స్టేషన్‌కు బదిలీపై వెళ్లి అక్కడ సస్పెన్షన్‌కు గురయ్యాడు. తన వద్ద దొంగల నుంచి రికవరీ చేసిన బంగారం ఉందని, అది తాకట్టులో ఉందని, విడిపించాలంటూ మాయ మాటలు చెప్పి పలువురి వద్ద రూ.లక్షల్లో నగదు వసూలు చేశాడు. అనంతరం బంగారం ఇవ్వకపోవడంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కానిస్టేబుల్ గోవింద్‌పై గుంటూరులోనూ పలు చీటింగ్ కేసులు నమోదు కాగా సోమవారం నగరంపాలెం పోలీసులు గోవింద్‌ను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

గంజాయి కేసులో ఐదుగురు అరెస్ట్

వివరాలు వెల్లడించిన సీఐ శేషగిరిరావు

తాడేపల్లిరూరల్: పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇప్పటంలో గంజాయి విక్రయిస్తున్న, కొనుగోలు చేస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని సోమవారం కోర్టులో హాజరుపరిచారు. సీఐ శేషగిరిరావు వివరాలు వెల్లడించారు. విజయవాడ, సత్యనారాయణ పురానికి చెందిన కాకర్లపూడి అశోక్, విజయవాడ, శ్రీనివాస నగర్, పప్పులనివాసముండే నత్తల దుర్గా ప్రవీణ్ ఏ.ఓన్సీ ఏరియాలోని గుర్తుతెలియని సాధువు వద్ద గంజాయి కొనుగోలు చేసి ఇప్పటం పరిసర ప్రాంతాల్లో విద్యార్థులకు అమ్మేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో పక్కా సమాచారంతో ఎస్ఐ రమేష్, గంజాయి విక్రయిస్తుండగా అశోక్, దుర్గాప్రవీణ్‌లను అదుపులోకి తీసుకున్నారు. విచారించగా వారు ఇప్పటానికి చెందిన ఇండ్ల సాయితేజ, అదే గ్రామానికి గాజుల వెంకటేశ్వరరావు, మంగళగిరి రూరల్ పరిధిలోని నవులూరుకు చెందిన కొల్లి సాయితేజలకు గంజాయి అమ్మినట్లు తెలపడంతో వారిని కూడా ఇప్పటంలోనే అదుపులోకి తీసుకున్నామన్నారు. అదుపులోకి తీసు


అరెస్ట్ చూపిస్తున్న తాడేపల్లి సీఐ శేషగిరిరావు తదితరులు

కునే సమయంలో అశోక్ వద్ద బైక్‌లో ఉన్న ఐదు ప్యాకెట్లు గంజాయి, నత్తా దుర్గా ప్రవీణ్ వద్ద ఐదు ప్యాకెట్లు, ఇండ్ల దుర్గారావు వద్ద మూడు ప్యాకెట్లు, గాజుల వెంకటేశ్వరరావు వద్ద ఒకటిన్నర ప్యాకెట్, కొల్లి సాయితేజ వద్ద ఒకటిన్నర ప్యాకెట్ లభించిందని చెప్పారు. గంజాయి మొత్తం 1.5 కేజీ ఉందని వివరించారు. వీరందరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ శేషగిరిరావు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ రమేష్, క్రైం సిబ్బంది కొండలరావు, కల్యాణ్ పాల్గొన్నారు.

అంబులెన్స్ డ్రైవర్లు అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు

నెహ్రూనగర్: గుంటూరు జీజీహెచ్ పరిసర ప్రాంతాల్లోని అంబులెన్సు యజమానులు అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉప రవాణా శాఖ కమిషనర్ షేక్ కరీం హెచ్చరించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్టీఏ కార్యాలయం వద్ద అంబులెన్సు యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంబులెన్సు యజమానులు, డ్రైవర్లు కోవిడ్ బాధితులు, వారి మృతదేహాలు, ఇతరుల మృతదేహాలను అంబులెన్స్‌లో తరలించేందుకు ఎంత చార్జీ వసూలు చేయాలో తగు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. అంతకు మించి అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా అంబులెన్సు డ్రైవర్లు అధిక చార్జీలు వసూలు చేస్తే ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు సూచించారు.


అంబులెన్సు యజమానులు, డ్రైవర్లుతో సమావేశమైన డీటీసీ షేక్ కరీం

'లోన్ యాప్' వేధింపులతో విద్యార్థి అదృశ్యం



తాడేపల్లిరూరల్: రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం ఓ ప్రైవేటు వర్సిటీలో బీటెక్ మూడో ఏడాది విద్యార్థి లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులకు హాస్టల్ నుంచి పరారైన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు.. సంతమాగులూరు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న రావినూతల నగేష్ రెండో కుమారుడైన సమీర్ కుమార్ వడ్డేశ్వరంలో బీటెక్ చదువుతున్నాడు. గత కొంతకాలం క్రితం లోన్ యాప్‌లో కొంత నగదును అప్పుగా తీసుకోగా సదరు యాప్ నిర్వాహకులు సమీర్‌కుమార్‌కు ఫోన్ చేసి వేధింపులకు గురిచేయడంతో మనస్తాపం చెందిన సమీర్ కుమార్ ఉదయం 8.27 నిమిషాలకు తండ్రి నగేష్‌కు లోన్ తీసుకున్నాను, వాళ్లు నన్ను వేధిస్తున్నారంటూ మెసేజ్ పెట్టి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి నివాసముంటున్న హాస్టల్ నుంచి వెళ్లిపోయాడు. ఘటనపై తెలంగాణ రాష్ట్రం, తెల్లపూర్ మండలం, చంద్రరావు గ్రామంలో నివాసముండే సమీర్‌కుమార్ బాబాయి కోటేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని...

మోసగించిన వ్యక్తులపై స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక- స్పందన (గ్రీవెన్స్) నిర్వహించారు. అర్జీదారుల నుంచి ఫిర్యాదులను జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ స్వీకరించారు. బాధితుల సమస్యలను అలకించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి వారం నిర్వహించే స్పందనలో వచ్చే సమస్యలకు వెంటనే పరిష్కరించాలని అన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని పోలీస్ అధికారులను జూమ్ ద్వారా ఆదేశించారు. ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం), డీఎస్పీలు ప్రకాష్‌బాబు (క్రైం), సీహెచ్.రామారావు (దిశ పీఎస్) స్వీకరించారు.


మహిళల సమస్య అలకిస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, పక్కన ఏఎస్పీ శ్రీనివాసరావు

న్యాయం చేయాలి..

నా రెండో కుమారుడు ప్రదీప్, రేవేంద్రపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివేవాడు. పాఠశాలలోని మరుగుదొడ్డి వద్ద స్నేహితులతో గొడవ జరగ్గా, మైదానంలో ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో ఉపాధ్యాయుడు చూసి వారిని మందలించారు. తర్వాత ప్రదీప్ అతడి స్నేహితులతో వెళ్లి వారిపై గొడవకు దిగారు. దీంతో అవతలి వైపు విద్యార్థులు ప్రదీప్‌ను ఈ ఏడాది జనవరి 8న బైక్‌పై తీసుకెళ్లి మంచికలపూడి- చిలువూరు మధ్య రైల్వే ట్రాక్ వద్ద చితకబాదారు. సమీపంలో పనులు చేసే రైతులు చూసి కేకలు వేయగా, ప్రదీప్‌ను ముందుకు తీసుకెళ్లి, హత్య చేసి రైల్వే పట్టాలపై పడవేశారు. కుమారుని మృతదేహానికి మరలా శవపరీక్షలు నిర్వర్తించాలని, వారిపై 302, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, న్యాయం చేయాలి.
– ప్రదీప్ తల్లి జి.కల్యాణి, చిలువూరు, దుగ్గిరాల

డాక్యుమెంట్లు ఎత్తుకెళ్లారు..

తాడికొండ పొన్నెకల్లు శివాలయం వెనుక 180 గజాల స్థలంలో రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించుకున్నాం. తద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కొందరు ఆక్రమించుకునేందుకు తెలిసిన వారు ప్రయత్నించారు. దీనిపై తాడికొండ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే భవనంలోని విలువైన డాక్యుమెంట్‌లు, రశీదు పుస్తకాలను తస్కరించుకుని వెళ్లారు. అంతేగాక రాజకీయ ఒత్తిడి తీసుకువస్తున్నారు. న్యాయం చేయాలి.
– పి.మల్లికార్జునరావు, బి.వెంకటేశ్వరరావు, కాశీవిశ్వనాథ్, శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం

రైతులను ఆదుకోవాలి..

రెండేళ్లుగా విజయవాడలోని కమిషన్ ఏజెంట్‌తో క్రయ విక్రయాలు చేశాం. 2019లో 22 లారీల్లో 550 టన్నుల మినుములు, ధాన్యం, మొక్కజొన్న తీసుకెళ్లాడు. అప్పటి నుంచి డబ్బులు చెల్లించలేదు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిబ్రవరిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దాదాపు రూ.72 లక్షలు చెల్లించాల్సి ఉంది. దీనిపై అడిగితే సరైన సమాధానం రావడం లేదు. తమకు న్యాయం చేయాలి.
–కానాల శ్రీనివాసరెడ్డి, రవీంద్రరెడ్డి, కె.చంద్రపాల్, ఆర్.మోహన్, సొపాడు, వట్టిచెరుకూరు

విద్యుత్ శాఖలో ఉద్యోగలంటూ..

వట్టిచెరుకూరు, రాజుపాలెం, ఈపూరు మండలం బడేపూడివారిపాలెంకు చెందిన ముగ్గురు తెలిసిన వ్యక్తులు పరిచయమై, విద్యుత్‌శాఖ, రాజకీయపరంగా పలుకుబడి ఉందని నమ్మబలికారు. ఈ ముగ్గురిలో విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తించే వ్యక్తి ఉన్నాడు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.2.50 లక్షలు, రూ.6 లక్షలు తీసుకున్నాడు. నెలలు గడిచినా సరైన స్పందనలేదు. గత నెల 30న ఓ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితంలేదు. సదరు వ్యక్తులు గతంలోనూ పలువుర్ని మోసగించినట్లు తెలిసింది. న్యాయం చేయగలరు..
– వి.ప్రమోద్‌కుమార్, ఎస్.సురేష్, ఐపీడీకాలనీ, సంగడిగుంట

రూ.లక్షల్లో కాజేశారు..

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురు మోసగించారని బాధితులు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. గుంటూరు సాయిబాబారోడ్‌లో ఉంటున్న తెలిసిన ఓ వ్యక్తి కృష్ణా జిల్లా రెవెన్యూ శాఖలో జూనియర్ సహాయకుని ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2 లక్షలు తీసుకున్నాడు. నెలలు గడిచినా ఉద్యోగం ఊసేలేదు. డబ్బులు/ ఉద్యోగ విషయామై అడిగితే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడు.
-జి.సుధాకర్, తాడేపల్లి

రెండేళ్లు గడిచినా..

బృందావన్‌గార్డెన్స్‌లోని ఓ బాలుర వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్నా. తెలిసిన వ్యక్తి పరిచయమై, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని చెబితే అతడికి రూ.3 లక్షలు చెల్లించాను. రెండేళ్లు గడిచినా ఉద్యోగ్యం లేదు, డబ్బులేవు..
– ఇ.దుర్గారావు, దొండపాడు, నరసరావుపేట

పది రోజుల్లో ఉద్యోగమని...

పశుసంవర్ధక శాఖలో జూనియర్ సహాయకునిగా ఉద్యోగం ఇప్పిస్తానని తెలిసిన మావ, రాజుపాలెం మండలం ఇనిమెట్లకు చెందిన భార్యాభర్తలు చెప్పారు. రూ.10 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని చెప్పగా, అందుకుగాను గతేడాది మే 4న వారికి రూ.5 లక్షలు యిచ్చాను. పది రోజుల్లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నెలలు గడిచినా ఉద్యోగం ఇప్పించలేదు. న్యాయం చేయగలరు.
-పి.శ్రీకాంత్, శ్రీనగర్

చిట్టీలతో..

కొరిటిపాడు సాకేతపురానికి చెందిన ఓ మహిళ వద్ద చిట్టీలు వేశాం. ఆమె రూ.30 వేల నుంచి రూ.10 లక్షల చిట్టీలు నిర్వహించేది. గత నెల్లో ఆమె మృతి చెందింది. పాడుకున్న చిట్టీలు, చెల్లించే చిట్టీల పరిస్థితి అయోమయంగా మారింది. డబ్బుల విషయామై మృతురాలి కుటుంబ సభ్యులను అడిగితే నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారు. తమకేం సంబంధంలేదని చెబుతున్నారు. పైసా పైసా దాచుకుని, ఏదైనా అవసరాలకు ఉపయోగపడతాయని చిట్టీ లేస్తే ఇలా జరిగింది. న్యాయం చేయగలరు.
– వై.పుష్పలత, కె.అంజలి, కె.నాగమ్మ, డి.చిన్ని, ప్రియ, కనకమహాలక్ష్మి, షేక్.షకీలా, కొరిటిపాడు

ఉత్తమ ప్రదర్శనగా 'నాన్న నే వచ్చేస్తా'

- ద్వితీయ, తృతీయ ఉత్తమ ప్రదర్శనలుగా 'అతీతం', 'వెండి అంచులు 'నాటిక
- ముగిసిన తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు

చేబ్రోలు: ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటికల పోటీలలో 'నాన్న నే వచ్చేస్తా' నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈనెల నాలుగో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో డాక్టర్ నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ వేదికపై నిర్వహిస్తున్న నాటిక పోటీలు సోమవారం ముగిశాయి. శ్రీ అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ గుంటూరు వారు ప్రదర్శించిన 'నాన్న నే వచ్చేస్తా' నాటికకు ఉత్తమ ప్రదర్శన అవార్డు లభించింది. గుంటూరు అభినయ ఆర్ట్స్ సమర్పించిన 'అతీతం' నాటికకు ద్వితీయ, అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారు సమర్పించిన 'వెండి అంచులు' తృతీయ ఉత్తమ ప్రదర్శన అవార్డు కై వసం చేసుకుంది. నాటిక పోటీల న్యాయ నిర్ణయితలు ఏవీ శివయ్య, డాక్టర్ కేజీ వేణు వివరాలు వెల్లడించారు. శర్వాణి గ్రామీణ సాంస్కృతిక సేవా సంఘం సమర్పించిన బోరివంక వారి కొత్త పరిమళం నాటికకు ఉత్తమ జూరీ ప్రదర్శన అవార్డు దక్కింది. ఉషోదయ కళానికేతన్ కాట్రపాడు వారు సమర్పించిన ప్రక్షాళన నాటికలో కృష్ణయ్య పాత్రధారి చెరుకూరి సాంబశివరావుకు ఉత్తమ సహాయ నటుడు అవార్డు దక్కింది. వెండి అంచులు నాటికకు రంగాలంకరణ చేసిన రాముకు ఉత్తమ రంగాలంకరణ అవార్డు రాగా, ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారి ప్రక్షాళన నాటికలో వెంకట్రావు పాత్రధారి పున్నయ్య చౌదరికి ఉత్తమ క్యారెక్టర్ నటుడు అవార్డు దక్కించుకున్నారు. గుంటూరు వారి అమృత లహరి థియేటర్ ఆర్ట్స్ నాన్న నే వచ్చేస్తా నాటికలో ఢిల్లీ అప్పారావు పాత్రధారి బత్తుల వెంకటేశ్వరరావుకు ఉత్తమ హాస్యనటుడు అవార్డు లభించింది. అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి వెండి అంచులు నాటికలో గోమతి పాత్రధారిని వసంత యామినికి ద్వితీయ ఉత్తమ నటి అవార్డుకు ఎంపికయ్యారు. మద్దుకూరి ఆర్ట్స్ క్రియేషన్స్ చిలకలూరిపేట వారి మృత్యు పత్రం నాటికలో శాంతమ్మ పాత్రధారిని వై భవానీ, అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి వెండి అంచులు నాటికలో రఘురాం పాత్రధారి వీవీ స్వామి, శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం బోరివంక వారి కొత్త పరిమళం నాటికలో కెప్టెన్ డాక్టర్ గోపాల్ పాత్రధారి బి.శోభన్ బాబు, శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారి ప్రేమతో నాన్న నాటికలో సురేష్ పాత్రధారి గోపరాజు విజయ్, శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరి వారి ప్రేమతో నాన్న నాటికలో లావణ్య పాత్రధారిని సురభి ప్రభావతి నటీనటులకు ప్రత్యేక ప్రశంసా బహుమతులు అందజేశారు.


ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన నాన్న నే వచ్చేస్తా నాటికలోని ఓ దృశ్యం

ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వేణుగోపాల్

సత్తెనపల్లి: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, న్యాయవాది నరిశేటి వేణుగోపాల్ ఎన్నికయ్యారు. రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ రివర్ బే హాలులో ఆదివారం జరిగిన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఏపీ రాష్ట్ర 11వ మహాసభలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మే 28 నుంచి అఖిల భారత నాటక పోటీలు

తెనాలి: పల్లెకోనలో ఏటా ఏప్రిల్ 27 నుంచి నిర్వహించే పరుచూరి రఘుబాబు స్మారక ట్రస్ట్ నాటకోత్సవాలు ఈ ఏడాది మార్పు చేశారు. మేనేజింగ్ ట్రస్టీ పరుచూరి వెంకటేశ్వరరావు, సమన్వయకర్త డి.రామకోటేశ్వరరావు సోమవారం ఇక్కడ విడుదల చేసిన ప్రకటనలో వివరాలను తెలిపారు. తొలిరోజైన మే 28న శ్రీకళానికేతన్, హైదరాబాద్‌వారి 'ఎర్ర కలువ' నాటకాన్ని ప్రదర్శిస్తారు. 29న మిత్ర క్రియేషన్స్, నరసరావుపేట వారి 'ది ఇంపోస్టర్స్'(అంతా నిజమే చెబుతారు), చైతన్య కళాస్రవంతి, ఉక్కునగరం వారి 'సవారీ' నాటకాలను ప్రదర్శిస్తారు. 30న విద్యానగర్ కల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్ వారి 'సిరి మింగిన వెలగపండు', అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి 'ఇంద్రప్రస్థం' నాటకాలను ప్రదర్శిస్తారు. చివరి రోజైన మే 31న విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్, హైదరాబాద్ వారి 'కలనేత' ప్రదర్శన, అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం ఉంటాయని వివరించారు.

ఇంటర్ విద్యార్థి బలవన్మరణం

బల్లికురవ: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యానన్న బాధతో ఓ విద్యార్థి పురుగుమందు తాగి ఐదు రోజులు మృత్యువుతో పోరాడి ఆదివారం అర్ధరాత్రి కన్నుమూశాడు. బాపట్ల జిల్లా బల్లికురవ ఎస్ఐ వి.వేమన కథనం మేరకు.. పెద అంబడిపూడి గ్రామానికి చెందిన గుంటుపల్లి శ్రీను, శ్రావణ సంధ్య కుమారుడు వీరబ్రహ్మేంద్రరావు (19) మార్టూరులోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ చదివాడు. ఎక్కువ సబ్జెక్టుల్లో ఫెయిల్ అవడంతో తల్లిదండ్రులు మందలించారు. జీవితంపై విరక్తితో గత బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగాడు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

తీరంలో పటిష్ట భద్రతా చర్యలు

- యాత్రికుల రక్షణే ధ్యేయం
- ఎస్పీ వకుల్ జిందాల్
- 39 మంది ప్రాణాలు కాపాడిన పోలీస్ సిబ్బందికి అభినందన

బాపట్ల టౌన్: తీరంలో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉన్నప్పుడే ప్రజల ప్రాణాలను కాపాడగలమని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లాలోని సూర్యలంక, వాడరేవు బీచ్‌లో కొట్టుకుపోతున్న యాత్రికుల ప్రాణాలను కాపాడిన సివిల్, మెరైన్ పోలీస్ సిబ్బందిని సోమవారం అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ తీరంలో పటిష్ట భద్రత చర్యలు ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం యాత్రికుల ప్రాణాలను కాపాడిన కొత్తపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఎ.నరేష్‌బాబు, హోంగార్డు ఎస్.శ్రీనివాసరావు, సూర్యలంక మెరైన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జి.గంగాధర్‌రావు, హోంగార్డ్ ఎస్.శ్రీనివాసరావు, బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.పోతురాజు, కానిస్టేబుల్ పి.వెంకటరావు, గజ ఈతగాడు సంగాని సురేష్‌ను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సూర్యలంక మెరైన్ సీఐ జి.సుబ్బారావు, కొత్తపట్నం మెరైన్ సీఐ కె. శ్రీనివాసరావు, జిల్లా ఎస్బీ సీఐ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.


ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

ఉత్తమ విలువలతో ఉజ్వల భవిష్యత్

- ఏఎన్‌యూ వీసీ ఆచార్య రాజశేఖర్
- ఘనంగా ఏఎన్‌యూ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల ఉత్సవాలు
- విద్యార్థి జ్ఞాపకాలు నెమరవేసుకున్న ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని

ఏఎన్‌యూ: విలువలు, ఉన్నత వ్యక్తిత్వమే ఉజ్వల భవిష్యత్‌కు మార్గదర్శకమని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన ఏఎన్‌యూ ఆర్ట్స్, కామర్స్, లా, సైన్స్ కళాశాలల ఉత్సవాలు నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ ఉన్నత ఆశయాలు, స్పష్టమైన భావాలు, వ్యక్తిత్వం వంటి విషయాలలో పోసాని వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రస్తుతం యువతకు ప్రపంచ వ్యాప్తంగా అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకునే నైపుణ్య లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఆర్ట్స్, సైన్స్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి, ఆచార్య గంగాధరరావు కళాశాలల నివేదికలు సమర్పించారు. రెక్టార్ పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, ఓఎస్‌డీ కె.సునీత, సీడీసీ డీన్ కె.మధుబాబు, ఐఎస్సీ డైరెక్టర్ చెన్నారెడ్డి, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఉదయకుమార్, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సిద్దయ్య తదితరులు ప్రసంగించారు. యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ కళాశాలల ఉత్సవాల సందర్భంగా ఆయా విభాగాల విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు పోసాని కృష్ణ మురళి, వీసీ ఆచార్య పి.రాజశేఖర్ బహుమతులు అందజేశారు.


ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణ మురళిని సన్మానిస్తున్న వీసీ రాజశేఖర్, రెక్టార్ వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ కరుణ, యూనివర్సిటీ అధికారులు

చివరి బెంచ్ విద్యార్థినే: పోసాని

పోసాని కృష్ణమురళి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో తన విద్యార్థి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తాను విద్యార్థిగా ఉన్న కాలంలో బలమైన సంఘం నుంచి పోటీ చేస్తేనే గెలిచేవారని కానీ తాను స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి ప్రధాన కార్యదర్శిగా భారీ మెజార్టీతో గెలిచానన్నారు. తన వ్యక్తిత్వమే ఆ విజయానికి కారణమని నేను ఇప్పటికీ చెప్పగలనన్నారు. తాను ఎంఏ తెలుగు చదువుతుండగా ఆ విభాగానికి చెందిన ఓ సీనియర్ అధ్యాపకుడు విలువలు లేకుండా వ్యవహరించాడని, అతన్ని చూసి తాను కనీసం లేచి నుంచునే వాడిని కాదన్నారు. నన్ను చూసి ఆ అధ్యాపకుడు తప్పు తెలుసుకుని తలదించుకున్నాడని చెప్పారు. ఎప్పుడూ తరగతిలో చివరి బెంచ్‌లోనే కూర్చునేవాడిని, నా బెంచ్‌పై నా పేరు ఇప్పటికీ ఉండి ఉంటుందనుకుంటున్నా అన్నారు.

డీజిల్ దొంగలు అరెస్టు



అరెస్టు చేసిన దొంగలతో ఎస్‌ఐ రవీంద్రబాబు, సిబ్బంది

ప్రత్తిపాడు: డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన దేశబోయిన బాజి స్థానికంగా నివాసం ఉంటూ లారీ నడుపుకుని జీవనం సాగిస్తున్నాడు. ఏప్రిల్ 30వ తేదీ రాత్రి తన అశోక్ లేలాండ్ లారీని తన ఇంటి సమీపంలోని పదహారవ నంబరు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో పార్క్ చేశాడు. అదే రోజు గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు కారులో వచ్చి లారీలోని ముప్పై లీటర్ల డీజిల్‌ను దొంగిలించారు. దీంతో బాజి ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసిన పోలీసులు దొంగల కోసం గాలించారు. సోమవారం వారు తుమ్మపాలెం సమీపంలో సంచరిస్తుండగా ప్రత్తిపాడు ఎస్‌ఐ రవీంద్రబాబు తన సిబ్బందితో మైనర్ సహా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా డీజిల్‌ను దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. పుల్లలచెరువు మండలం గంగవరం గ్రామానికి చెందిన లెక్కల పూర్ణ, బొల్లాపల్లి మండలం సీతారామపురం తండాకు చెందిన మూడవతు హనుమా నాయక్‌తోపాటు అదే గ్రామానికి చెందిన 17 సంవత్సరాల మైనర్‌ను ఎస్‌ఐ అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. వారి వద్ద నుంచి 30 లీటర్ల డీజిల్‌తో పాటు దొంగతనానికి వినియోగించిన ఇన్నోవాకారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సీపెట్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో (సీపెట్)లో 2023-24 విద్యా సంవత్సరానికి డిప్లొమా, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.శేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల వ్యవధితో డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సులకు పదో తరగతి విద్యార్హత గల వారు అర్హులని పేర్కొన్నారు. బీఎస్సీ ఉత్తీర్ణత లేదా ఆఖరి సంవత్సరం చదువుతున్న వారు రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సునకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సీఐపీఈటీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 28 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ ఆరో తేదీన ఆన్‌లైన్‌లో సీపెట్ అడ్మిషన్ టెస్ట్ జరుగుతుందని తెలిపారు. అర్హులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయంతో పాటుగా విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా హాస్టల్ సదుపాయం కూడా కల్పిస్తున్నామని వివరించారు. కోర్సులు పూర్తయిన తర్వాత క్యాంపస్ సెలెక్షన్ల ద్వారా దేశ విదేశాల్లో ప్లాస్టిక్ తయారీ, ప్లాస్టిక్ మౌల్డ్ పరిశ్రమలు, టెస్టింగ్, క్వాలిటీ నిర్ధారణ రంగాల్లో మంచి ఉద్యోగావకాశాలు పొందొచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు 63001 47965 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు.

బిల్డర్‌కు వినియోగదారుల ఫోరం జరిమానా

కంకిపాడు(పెనమలూరు): భవన నిర్మాణంలో నాణ్యతా లోపాలపై అపార్టుమెంట్ వాసులు వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించటంతో ఆ బిల్డర్‌కు ఫోరం జరిమానా విధించింది. అపార్టుమెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలమంచిలి కిషోర్‌బాబు సోమవారం ఈ వివరాలు విలేకరులకు తెలిపారు. పట్టణంలోని అయానా కల్యాణ మండపం సమీపంలోని ఓ అపార్టుమెంట్ నిర్మాణం లోపాలపై అపార్టుమెంట్ వాసులు 2014 సంవత్సరంలో వినియోగ దారుల ఫోరంలో కేసు దాఖలు చేశారు. ఫోరం న్యాయమూర్తి నేలపూడి చిరంజీవి ఈ కేసు విచారించి బిల్డర్ అందె మహేష్‌సూర్య భాస్కరరావుకు రూ.10 వేల జరిమానా విధించారు. నాణ్యతాలోపాలను సరిచేయాలని ఆదేశించారు. కోర్టు ఖర్చులకు మరో రూ.10 వేలు కమిటీకి అప్పగించాలని ఆదేశించారు.

నకిలీ డాక్యుమెంట్లతో రూ.25 లక్షలు స్వాహా

పెనమలూరు: నకిలీ డ్యాక్యుమెంట్లు చూపి రూ.25 లక్షలు తీసుకుని స్థలం రిజిస్ట్రేషన్ చేసి మోసగించిన ఇద్దరిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు కథనం మేరకు.. హైదరాబాద్‌కు చెందిన మందపాటి వెంకటేశ్వర రావుకు బంధువుల ద్వారా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే సత్యాల మురళి పరిచయమయ్యాడు. కానూరులో 96/5 సర్వే నంబ ర్‌లో ప్లాట్ నంబర్ 395ఏ పేరుతో 200 గజాల స్థలం ఉందని చూపించాడు. ఆ స్థలం యజమాని ఎర్రసూరి దుర్గాప్రసాద్ అని చెప్పాడు. ఆ స్థలం నచ్చడంతో మందపాటి వెంకటేశ్వరరావు 2013 సంవత్సరంలో మురళీ ద్వారా దుర్గాప్రసాద్‌కు రూ.25 లక్షలు అందజేశారు. అనంతరం పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అయితే ఇటీవల వెంకటేశ్వరరావు తాను కొనుగోలు చేసిన స్థలం వద్దకు వెళ్లి చూడగా వేరే వ్యక్తి ఆ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించడాన్ని గుర్తించారు. స్థలం వ్యవహారంపై వెంకటేశ్వరరావు ఆరా తీయగా మురళి, దుర్గాప్రసాద్ నకిలీ డాక్యుమెంట్లతో తనను మోసం చేసినట్లు గుర్తించారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు మోసం చేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఐటా టెన్నిస్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు

విజయవాడ స్పోర్ట్స్: ఆల్ ఇండియా టెన్నిస్ అసోసి యేషన్(ఐటా) చాంపియన్‌షిప్ సిరీస్ అండర్ -14,16 జాతీయ ర్యాంకింగ్ పోటీలు విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని స్టార్ టెన్నిస్ అకాడమీలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఆయా వయసు విభాగాల్లో 170 మంది క్రీడాకారులు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు, కృష్ణా జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు డాక్టర్ జయదేవ్, డాక్టర్ వై.రామ్‌కుమార్ ఈ పోటీలను ప్రారంభించారు. జాతీయ స్థాయి పోటీలను తమ గ్రామంలో నిర్వహించడంపై సర్పంచ్ సంతోషం వ్యక్తం చేశారు. దేశ నలుమూల నుంచి క్రీడాకారులు తరలిరావడంతో గ్రామంలో క్రీడా సందడి నెలకొందన్నారు. స్టార్ టెన్నిస్ అకాడమీ డైరెక్టర్ కె.వేణుగోపాలరావు మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. తమ అకాడమీ ఏర్పాటై ఏడాది గడుస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు చీఫ్ రిఫరీగా ఎం.శివకుమార్ (విశాఖపట్నం) వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జి.వి.ఎస్.ప్రసాద్, టెన్నిస్ కోచ్ గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

హనుమాన్ జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను మంగళవారం ఉదయం 8 గంటలకు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఉత్సవాల తొలి రోజున అంజనీపుత్రుడికి 1008 గులాబీ పూలతో ప్రత్యేక పూజ, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నారు. సాయంత్రం బంగారు, వెండి పుష్పాలతో విశేష అర్చన, కోలాటం ప్రదర్శన, మ్యాజిక్ షో, మ్యూజికల్ నైట్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాన్ని, జంక్షన్ ప్రధాన కూడలిలో విద్యుద్దీపాలంకరణతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చలువ పందిళ్లు నిర్మాణం, క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

'ప్రత్యేక' పిల్లలకు ఉపకరణాలు పంపిణీ

పటమట(విజయవాడతూర్పు): పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేక అవసరాల గల పిల్లలకు అలవెన్సులు, ఉపకరణాలు, ఫిజియోథెరపీ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని సమగ్ర శిక్ష పథక రాష్ట్ర సంచాలకుడు బి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పటమట కేబీసీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్టీఆర్ జిల్లాలో 17 మండలాల భవిత కేంద్రాల్లోని 564 మంది పిల్లలకు ఉపకరణాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్వర్ణ టోల్ వే ప్లాజా సంస్థ అందించిన రూ. 25 లక్షల విలువగల ఉపకరణాలు పిల్లలకు పంపిణీ చేస్తున్నామన్నా మన్నారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలను సర్వేలో నాలుగైదు అంశాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోగా రాష్ట్రంలో 92,326 మంది విద్యార్థులను గుర్తించామని, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎన్సీఈఆర్టీ 21 అంశాలతో రూపొందించిన 'ప్రశస్తి'యాప్ ద్వారా సర్వే చేస్తే మరో లక్ష మంది పిల్లలు ఉండొచ్చన్నారు. ఇందులో భాగంగా చదువుకొని, రాయగల పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చి ప్రత్యేక సాఫ్ట్ వేర్ ద్వారా బోధనందిస్తామన్నారు. ఇటీవల అనంతపురం జిల్లాలోని ఆర్‌డీటీ (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్) ఇన్‌క్లూజివ్ హైస్కూల్‌కు చెందిన ఆరుగురు దివ్యాంగ (దృష్టి లోపం గల) విద్యార్థినులు డిజిటల్ విధానంలో పదో తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించారన్నారు. డీఈవో సీవీ రేణుక, సమగ్ర శిక్ష ఏపీసీ జి.మహేశ్వరరావు, రాష్ట్ర ఐఈ విభాగం కో ఆర్డినేటర్ శ్రీమతి ఎన్‌కే అన్నపూర్ణ పాల్గొన్నారు.